క్లుప్తంగా

ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలు వీరే..

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విజయ్‌కుమారిశర్మ, రితేష్‌కుమార్ తివారీ ఎంఎస్ థీసిస్ అవార్డు గ్రహీతలను గురువారం ప్రకటించారు. 2021, 2022 సంవత్సరాలకుగానూ ట్రిపుల్‌ఐటీలోని రోబోటిక్స్ రీసెర్చ్ సెంటర్(ఆర్ఆర్‌సి), సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్(సీసీఎన్‌ఎస్‌బీ) వారు అవార్డులను గెలుచుకోవడం విశేషం. ఇనిస్టిట్యూట్‌లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సహాయం అందించేందుకు ఈ అవార్డును అందించడం జరుగుతోంది. 2021 సంవత్సరానికి కర్ణిక్‌రామ్, 2022కు ఉత్కర్ష్ ఆజాద్‌లను అవార్డులకు ఎంపిక చేశారు. వారిని పలువురు అభినందించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికిగాను గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) లో సంబంధిత సబ్జెక్టులో 55% శాతం మార్కులు , ఎస్సీ ఎస్టీ, అభ్యర్థులు 50% శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలని, నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీల వివరాలు.... ఇంగ్లిష్‌లో-3, కామర్స్‌లో-2 , గణితంలో-2 , తెలుగు-1, కంప్యూటర్ అప్లికేషన్/సైన్స్‌లో-5 ,వృక్ష శాస్త్రంలో-1 జంతుశాస్త్రంలో-1 ఖాళీ ఉన్నాయని, గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 24 వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.అదేవిధంగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 25 వ తేదీ ఉదయం 10 గంటలకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష)కు హాజరు కావాలన్నారు.

ఇండోర్ షటిల్ కోర్టు భవనం త్వరలో ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియం భవనం నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభింప చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని కార్పొరేటర్ సబిహా బేగం గురువారం పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సురేష్, సుభాన్, సలీం, చాంద్‌సాబ్, నరసింహ, షేక్ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో 'ఆకుపచ్చ బాట నడుద్దాం'

పంజగుట్ట: సి.పి.రామస్వామి పర్యావరణ విద్యా కేంద్రం చెన్నై, వైబ్రాంట్ లివింగ్ సహకారంతో ఈ నెల 22, 23వ తేదీల్లో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పూర్తి శాకాహార ఉత్సవం 'ఆకుపచ్చ బాట నడుద్దాం' పేరుతో రెండు రోజుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పర్యావరణ విద్యా కేంద్రం చెన్నై డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేంద్రం హైదరాబాద్ ఇన్‌చార్జి, సీనియర్ పాత్రికేయులు వెంకటరత్నంతో కలిసి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం మనం సేవిస్తున్న పాలలో ఉన్న 59 రకాల హార్మోన్లు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. పాలు ఎక్కువగా ఇచ్చేందుకు పశువులకు ఇచ్చే ఇంజక్షన్ల వల్ల కూడా ఎన్నో అపాయాలు ఉన్నాయన్నారు. రెండు రోజుల ప్రదర్శనలో పాలకు ప్రత్యామ్నాయంగా మంచి ప్రొటీన్లు ఉన్న ఆకుకూరలు, కాయధాన్యాలు, చిక్కుళ్లు, ఆకుపచ్చ సహజ ఉత్పత్తులైన సోయా, సోయా బీన్స్, పుట్టగొడుగులు, ప్రత్యామ్నాయ వృక్ష సంబంధిత కొబ్బరిపాలు, బాదంపాలు, వేరుసెనగ పాలు తదితర 20 రకాల స్టాల్స్ ఉంటాయన్నారు. ఎవరైనా రావొచ్చని ప్రవేశం పూర్తిగా ఉచితమన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా


తన ఇంట్లో పలువురికి పునరావాసం కల్పిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: ఆపదలో ఉన్న వారికి తాను అండగా ఉంటానని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ముందుకు వచ్చారు. గురువారం భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆయన పరామర్శించారు. శిథిలావస్థకు చేరిన పలు ఇళ్ల వాసులను పునరావస కల్పించారు. తన సొంత ఇంట్లో వారికి ఆశ్రయం ఇచ్చి భోజన వసతి కల్పించారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలకు తాను ఉన్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు నిత్యవసరాలు పంపిణీ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలనీలు వానగుప్పిట్లో

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్, తులసినగర్, ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, ఎల్లమ్మబండ కాలనీలు నీట మునిగాయి.మరికొన్ని కాలనీల్లో పాములు, నత్తలు ఇంటి ద్వారాల వరకు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలనీలో చెట్లు విరిగి పడటంతో ట్రాఫిక్ జామ్‌తో పాటు విద్యుత్‌కు అంతరాయం కలుగుతోంది. అపార్టుమెంట్‌లో ఉన్న వారు విద్యుత్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. పరికి చెరువు నాలాలో రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు కలవడంతో గుట్టలు గుట్టలుగా నురుగు ఏర్పడి ప్రవహిస్తోంది. రసాయన వ్యర్థాల ఘాటైన వాసనలు రావడంతో ఆల్విన్‌కాలనీ ధరణినగర్, తులసినగర్ ప్రజలు ఊపిరాడక సతమతమవుతున్నారు. స్థానికంగా ఉన్న వయోవృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– ఆల్విన్‌కాలనీ


ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌లోని పరికి చెరువు నాలాలో రసాయన వ్యర్థాల నురుగు




శేషాద్రి నగర్‌లో రహదారులపై ఏరులై పారుతున్న వరదనీరు


బురదమయంగా మారిన తులసీనగర్ రహదారి


ధరణినగర్‌లో నాలా పొంగి పొర్లటంతో ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు


హైదర్‌నగర్ డివిజన్ శుభోదయకాలనీ, శ్రీనివాసకాలనీల్లో నిలిచిన వర్షపు నీరు


వై జంక్షన్‌లో..


వై జంక్షన్ మెట్రో వద్ద..


భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మాధవరం కాంతారావు హౌస్ అరెస్టు

కూకట్‌పల్లి: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాట సింగారంలో అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించేందుకు వెళ్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనకు మద్దతుగా బయల్దేరడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్న కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావును ఉదయం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ఆశచూపి 9 ఏళ్లుగా దగా చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రిని నిలదీసేందుకు బాట సింగారానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లే క్రమంలో తనను పోలీసులు హౌస్ అరెస్టు చేయటాన్ని ఖండిస్తున్నానని తెలిపారు.


మాధవరం కాంతారావును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

గచ్చిబౌలి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ కృషి చేస్తుందని ఆ శాఖ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పీఆర్‌టీయుటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొండాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టే విధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ శేరిలింగంపల్లి శాఖ హనుమంతు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, శంకర్, పీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట సర్కిల్ డీసీగా రమేష్

మూసాపేట: మూసాపేట సర్కిల్ నూతన ఉప కమిషనర్‌గా ఎ.రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మూసాపేట, కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్లు బదిలీపై వెళ్లారు. మూసాపేట సర్కిల్‌లో పనిచేసిన ఉపకమిషనర్ రవికుమార్ రాజేంద్రనగర్‌కు బదిలీపై వెళ్లారు. యూసుఫ్‌గూడలో పనిచేసిన రమేష్ మూసాపేట సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్ రవీందర్‌కుమార్ హయత్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా సరూర్‌నగర్‌లో పని చేసిన హెచ్.కృష్ణయ్య బదిలీపై కూకట్‌పల్లికి వచ్చారు. సర్కిల్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీసీ రమేష్ తెలిపారు.



బబ్బుగూడలో కూలిన ఇంటి గోడ

పరామర్శించి ధైర్యం చెప్పిన శ్రావణ్‌కుమార్


బబ్బుగూడలో గోడ కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బబ్బుగూడలో ఒక ఇంటి గోడ కూలింది. విషయం తెలుసుకున్న మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో బబ్బుగూడ ప్రధాన కార్యదర్శి తిరుపతి, కబీర్‌నగర్ అధ్యక్షుడు మాజీద్, జోసెఫ్, హరిబాబు, సుందర్, లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


భాగ్యమ్మ (ఫైల్)

మోతీనగర్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. అల్లాపూర్ సీఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కెతావత్ బాలు సోదరి భాగ్యమ్మ (38) గత 15 సంవత్సరాలుగా లేబర్ పని చేసుకుంటూ అల్లాపూర్‌లో నివాసం ఉంటోంది. ఈనెల 14న పని నిమిత్తం ఉదయం 9గంటల ప్రాంతంలో వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన ఆమె సోదరుడు కెతావత్ బాలు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో అల్లాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



నెమలి కన్నులు పుస్తకావిష్కరణ

రాయదుర్గం: హెచ్‌సీయూలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్లవెంకటేశ్వరరావు రచించిన నెమలి కన్నులు (ఆత్మకథ మొదటిభాగం) పుస్తకాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయ ట్రైబల్ అధ్యాపక సంఘం కార్యదర్శి ఆచార్య ఎం గోనానాయక్ ఆవిష్కరించారు.ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే ఆచార్య దార్ల ఆత్మకథ అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ కనిపించే కొన్ని బహిర్గతం కాని జీవన సంఘర్షణలు, సంవేదనలను ఆత్మకథల్లో ప్రతిఫలింపచేస్తారని, అటువంటివెన్నో ఆచార్య దార్ల ఆత్మకథలో ప్రతిఫలించాయన్నారు. ఆత్మకథ రాయడమనేది ఒక సాహసంతో కూడిన పని అనీ అటువంటిది దళిత ఆత్మకథ రాయడం మరింత కష్టమైందన్నారు. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం పూర్వ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ కవిగా, విమర్శకుడుగా సహ అధ్యాపకులుగా ఉన్న ఆచార్య దార్ల తన ఆత్మకథలో ఒక దళితుడు విశ్వవిద్యాలయ స్థాయిలో ఉన్నతస్థితిలోకి రావడానికి గల నేపథ్యం ఈ ఆత్మకథలో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆచార్యులు పమ్మి పవన్‌కుమార్, డి విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యాతిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ డి విజయకుమారి మధుసూదన్, తిరుమల సింగ్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య గోనానాయక్, ఆచార్యులు

ఆర్థిక సాయం


రాజు కుటుంబీకులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేటలో నివాసం ఉండే ఒరిస్సాకి చెందిన తామరపల్లి రాజు ఇటీవల ప్రమాదవశాత్తు పెయింటింగ్ వేస్తూ బిల్డింగ్‌పై నుంచి పడిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం సదరు బిల్డింగ్ యజమానితో మాట్లాడి ఆ కుటుంబానికి రూ.6 లక్షల చెక్కును అందజేశారు.

భాషను కాపాడుకోవాలి

● మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: భాషా వారసత్వాన్ని రక్షించడంతో బాటు పెంపొందించుకోవాలని మనూ వీసీ ఐనుల్ హసన్ కోరారు.గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మేధావులతో ఆయన సమావేశమయ్యారు. విద్య, భాషా పరిరక్షణ, సామాజిక, విద్య, సమాజాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆయన వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాంతం, దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించడానికి మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం వివిధ రంగాలకు చెందిన పండితులు, రచయితలు, ప్రతినిధులు, నిపుణులతో చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు.

భువనేశ్వరి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నాయినేని లక్ష్మీబాయి, ధర్మకర్తలుగా టి.లక్ష్మీబాయి, జే.లక్ష్మి, ఆర్. రంగారావు, జి. సురేష్, కృష్ణా, మహేష్, గౌరవ సభ్యుడుగా కే. గోపాల్‌చారి ప్రమాణ స్వీకారం చేశారు. వారికి ఎమ్మెల్యే కృష్ణారావు,కార్పొరేటర్ శిరీషలు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

జీహెచ్‌ఎంసీ, జలమండలి సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన


నందమూరినగర్‌లో ముంపు ప్రాంతాలను పర్యటించిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో కలిసే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి గురువారం పర్యటించారు. అందులో భాగంగా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నందమూరి నగర్, నిజాంపేట రోడ్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో హుటాహుటిన అక్కడకు అధికారులతో కలిసి వెళ్లి సమస్యను పరిశీలించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వరద నీటి కాల్వ నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరనుందన్నారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు.

◆ ముంపు సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యమ్నాయ మార్గాల ద్వారా నీటిని తరలించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

◆ మాన్‌సూన్, ఎమర్జెన్సీ టీమ్‌లు అని పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్య ఏర్పడితే అన్నిరకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలాలకు రక్షణ చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ వేయాలన్నారు. ముంపు ఏర్పడే ప్రాంతాల్లో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

◆ నాలాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని పూడిక తీత ద్వారా తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితి అయితే తప్ప వర్షాలు తగ్గే వరకూ ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. తగు స్వీయ జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

